క్లుప్తంగా

బ్రాండిక్స్‌లో 290 మందికి కంటి పరీక్షలు

10 మంది రక్తదానం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్‌లో ఆదివారం 290 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 108వ కంటి వైద్య శిబిరాన్ని విశాఖ శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. 208 మందికి ఉచితంగా కళ్లద్దాలు, 54 మందికి మందులు పంపిణీ చేశారు. 24 మందిని కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్తదానం చేశారు. శిబిరాలకు విచ్చేసిన వారికి మధ్యాహ్న భోజనం, ఫలహారం, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు చేశారు.

13న పోతురాజుబాబు పండగ


ఉమ్మలాడలోని పోతురాజుబాబు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో ఈ నెల 13న పోతురాజుబాబు పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నా మని, అదే రోజు రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పోతురాజు బాబును దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

వడగాడ్పులతో విలవిల

రాంబిల్లి: వడగాడ్పులు మండలవాసులను బెంబేలెత్తిస్తున్నాయి. నాలుగు రోజులుగా ఎండవేడిమికి ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క ఉపాధి హామీ పథకం కూలీలు, వ్యవసాయ పనుల్లో రైతులు మండుటెండలకు విలవిలలాడుతున్నారు. జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మూతబడుతున్నాయి.

అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ట

కశింకోట : స్థానిక ద్వారపురెడ్డివారి వీధిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఊరేగించారు. స్థానిక రిక్షా స్టాండ్ నుంచి సంత బయల, ఉప్పునీటి దిబ్బల మీదుగా ద్వారపు రెడ్డి వారి వీధి వరకు ఊరేగింపు నిర్వహించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి ఆలయ ప్రతిష్టాపన, మధ్యాహ్నం అన్న సమారాధన జరపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

స్వచ్ఛభారత్‌కు ట్రాక్టర్ వితరణ


పంచాయతీ కార్యాలయానికి ట్రాక్టర్ అందిస్తున్న రవికృష్ణ

అనకాపల్లిటౌన్ : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రజలు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని శ్రీవాణి గ్రానైట్స్ క్వారీ యజమాని వై.రవికృష్ణ సూచించారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహణకు తమవంతు సాయంగా ట్రాక్టర్‌ను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిరుద్యోగ యువతకు క్వారీ లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. విధుల్లో ఉన్న కార్మికుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

25న యోగాసన పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 7 గంటలకు యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు సెంటర్ ప్రతినిధి సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి అరవయ్యేళ్ల వయస్సు కలిగిన వ్యక్తులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

ముగిసిన విద్యార్థుల వేసవి విజ్ఞాన శిబిరం


వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు


విద్యార్థులను ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న ఎంఈవో గాంధీ


కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈవో అప్పారావు


నక్కపల్లిలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ


దిమిలిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు

పాయకరావుపేట: పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా ముగిసింది. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివారం మండల విద్యాశాఖాధికారి కె.ఎస్.గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు నరేష్, విజయలక్ష్మి, ఎన్.వి.ఎస్ ఆచార్యులు తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొని విద్యార్థులకు వేసవి శిబిరం ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. 35 రోజుల పాటు పలు పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై రిసోర్స్ పర్సన్‌లతో శిక్షణ ఇప్పించారు. పద్య పఠనం, స్పోకెన్ ఇంగ్లీషు, చిత్రలేఖనం, యోగా, పుస్తక సమీక్షలు, పేపరు క్రాఫ్ట్, భగవద్గీత శ్లోక పఠనం, దేశ భక్తి గేయాలు, వంటి పలు అంశాలపై ఈ వేసవి శిబిరంలో శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజు పలు అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వారికి ఆదివారం నిర్వహించిన ముగింపు సమావేశంలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

రిసోర్స్ పర్సన్‌లకు ఘన సత్కారం

ఈ వేసవి శిబిరంలో పలు అంశాల పై అవగాహన కల్పించి పోటీలను నిర్వహించిన రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాసరాజు, సీతారామయ్య, అచ్యుతారావు, వాసు దేవరావులతో పాటు ముఖ్య అతిథులు కె.ఎస్.గాంధీ, నరేష్, విజయలక్ష్మి, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, ఎన్.వి.ఎస్ ఆచార్యులు తదితరులను గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఘనంగా సత్కరించారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: గ్రంథాలయాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు సత్ఫలితాలను ఇస్తాయని ఎంఈవో పి.అప్పారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించేలా, సృజనాత్మకతను వెలికి తీసేలా విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యా సంవత్సరం ఆరంభం నుంచి విద్యార్థులు చురుగ్గా ఉండేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం పలు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, సర్పంచ్ బి.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ కె.కొండబాబు, ఉపాధ్యాయులు బి.ప్రసాద్, ఎస్.లచ్చబాబు, జె.వి.ప్రసాదరావు, మస్తాన్, హెడ్‌కానిస్టేబుల్ వాసు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామిసత్యనారాయణ సంయుక్తంగా కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏకాగ్రతతో పాటు ఇష్టపడి ,కష్టపడి చదువుకొంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ది మ్మల అప్పారావు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు,ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం జరిగింది. వేసవి శిక్షణలో భాగంగా నీతి కథలు, చదవడం, రాయడంతో పాటు కోలాటాలు, భక్తి గీతాలు, పలు రకాల ఆటలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వేసవి శిక్షణలో రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన శానాపతి అప్పారావు, సిహెచ్ జగదీష్, టి. వెంకటలక్ష్మి, వాసవి తదితరులను ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, లైబ్రేరియన్ ఎస్. శకుంతల సన్మానించారు.

నక్కపల్లి: మండలంలో గ్రంథాలయాల్లో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ముగిసాయి. ఈనెలరోజుల పాటు విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాసరచన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించడం జరిగిందని, స్పోకెన్ ఇంగ్లీష్‌లో కూడా శిక్షణ ఇచ్చినట్టు చినదొడ్డిగల్లు లైబ్రేరియన్ కె.జనార్దన్ తెలిపారు. విజేతలకు ముగింపు కార్యక్రమం సందర్భంగా బహుమతులు ప్రశంసాపత్రాలను ప్రదానం చేయడం జరిగిందన్నారు. విజేతలను ప్రోత్సహిస్తూ బండారు చారిటబుల్ ట్రస్ట్ అధినేత బండారు గోవిందరావు బహుమతులను స్పాన్సర్ చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగబాబు, శ్రీదేవి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు పాల్గొన్నారు.

యలమంచిలి: యలమంచిలి శాఖా గ్రంథాలయంలో 35 రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసిందని గ్రంథాలయ అధికారి వి.ఆనంద్ తెలిపారు. 35 రోజుల పాటు విద్యార్థులకు వివిధ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించామని, విద్యార్థుల్లో పరివర్తన కోసం వారిలో అంగ్లపదాలపై పట్టు సాధించేలా నీతి కథలు బోధిస్తూ విశ్రాంత ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆనంద్ పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో రిటైర్డ్ కలెక్టర్ ఐఎస్ రావు కుమార్తె అనురాధ, ఆడారి పూరి జగన్నాథం మాస్టార్, పౌరసేవా సంఘం సభ్యులు కె.సూరిబాబు, కె.రామ్మోహనరావు, అడ్వకేట్ వై.అప్పారావు పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాంబాబు, షేక్ అబ్దుల్లా, తదితర విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


యలమంచిలిలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ప్రదానం

‘ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలి’

- అమిత్ షా పర్యటనకు నిరసనగా వామపక్షాల ఆందోళన


నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

అనకాపల్లి రూరల్ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ అనకాపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివారం వామపక్ష పార్టీల నేతలు నిరసన తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఎందరో ఉద్యమకారుల బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు చౌకగా అప్పగించేందుకే కేంద్రం ప్రైవేటీకరణకు తెర తీసిందని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేకంగా విశాఖకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆక్షేపించారు. రాజకీయ అవసరాల కోసం ఏపీ ప్రజాప్రతినిధులను ఉపయోగించుకుంటోన్న బీజేపీకి భవిష్యత్తులో ప్రజలంతా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎర్ర జెండాలు ప్రదర్శిస్తూ అమిత్ షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీపీఎం సీనియర్ నాయకుడు ఎ.బాలకృష్ణ, సీపీఎం(ఎంఎల్) నాయకుడు పి.అజయ్ కుమార్, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావు, ఐద్వా నాయకురాలు జి.సుభాషిణి, సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపురాజు, తాకాసి వెంకటేశ్వరరావు, పాత్రపల్లి వీరూ యాదవ్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి నగదు అందజేస్తున్న నారాయణరావు

నర్సీపట్నం: మున్సిపాలిటీ కశాసీ కాలనీకి చెందిన క్యాన్సర్ బాధితురాలు మారంపూడి సత్యవతికి వైద్య చికిత్స నిమిత్తం ఎన్నారై అసోసియేషన్ ప్రతినిధి వెలగా నారాయణరావు రూ.54 వేల సాయం చేశారు. బాధితురాలికి అండగా నిలవాలని దాతలను కోరారు. అదేవిధంగా ఆమెకు ప్రతి నెలా రూ.3 వేల చొప్పున అందజేసేందుకు అసోసియేషన్ సభ్యులు సుతాపల్లి శ్రీకాంత్, కొప్పర్తి కుమార్ హామీ ఇచ్చినట్లు నారాయణరావు తెలిపారు.

మా గ్రామానికి రోడ్డు వేయరూ..


అణుకు గ్రామానికి వెళ్లే రహదారి

కోటవురట్ల: గిరిజన గ్రామాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మా గ్రామానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా రావడం లేదని, ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నామని అణుకు గిరిజనులు వాపోతున్నారు. గొట్టివాడ శివారు గ్రామం అణుకు సుమారు 45 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా వీళ్ల తలరాత మాత్రం మారడం లేదు. ప్రధాన సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అణుకు గ్రామానికి సంబంధించి మెయిన్‌రోడ్డు నుంచి సుమారు 6 కిలోమీటర్ల మేర ఉన్న రహదారి మొత్తం రాళ్లు తేలి దారుణంగా ఉంది. నడవడానికి కూడా వీల్లేని విధంగా ఉండడంతో గిరిజనులు రాకపోకలలో నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనాలు వచ్చే వీలు లేకపోవడంతో గర్భిణులకు డోలీ మోత తప్పడం లేదు. అధికారులు స్పందించి తమ గ్రామ రహదారిని అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ


అమ్మవారి ఊరేగింపు


సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కాలనీవాసులంతా ఘటాలతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి రామ్మోహనరావు,మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నిప్పుల కుంపటిలా రోడ్లు


నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు


అడ్డురోడ్డులో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

ఎస్.రాయవరం: మండలంలో మూడు రోజులుగా నిప్పుల కుంపటిని తలపించేలా ఎండలు మండుతూ వేడి గాలులు వీస్తున్నాయి. గడిచిన రెండు రోజులుగా 40 నుంచి 42 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతూ మండల వాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 10 గంటలకే ఎండ మండిపోవడంతో వాహన చోదకులు రోడ్లపైకి రాలేకపోతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇక అడ్డురోడ్డు వ్యాణిజ్య కేంద్రం చిరు వ్యాపారులు ఎండ తీవ్రతకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వేడిగాలులతో అవస్థలు

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం వేడి గాలులు వీయడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ వేడిమి పెరిగిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రోడ్లపై రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. మెయిన్‌రోడ్డు నిర్మానుష్యంగా మారింది.

ఎంపీటీసీని పరామర్శించిన ఎమ్మెల్యే


చంద్రరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల కోఆప్షన్ సభ్యుడు లొడగల చంద్రరావును ఆదివారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరామర్శించారు. కాలి నరాలకు సంబంధించిన ఇబ్బంది ఎదురవడంతో ఎంపీటీసీ విశాఖలో ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. డాక్టర్లు నెలరోజుల పాటు విశ్రాంతి కావాలని చెప్పడంతో ఇంటి వద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాబూరావు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు చంద్రరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. చంద్రరావును పరామర్శించిన వారిలో సర్పంచ్‌లు కిల్లాడ రామకృష్ణ, నాగ అప్పలరాజు, పార్టీ సీనియర్ నాయకులు శీరం నర్సింహమూర్తి సూరాకాసుల గోవిందు, యలమంచిలి తాతబాబు, పోలిశెట్టి ఈశ్వరరావు, జంబోరాజు, ఎరిపల్లి నాగేశ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

యలమంచిలి : మండలంలోని రేగుపాలెం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలు.. ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై నక్కపల్లి గ్రామానికి చెందిన యువకులు తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఒక యువకుడు అక్కడికక్కడే మరణించగా, మరొక యువకుడిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆ యువకుడు కూడా చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. వారి పేర్లు, ఇతర వివరాలు ఇంకా తెలియరాలేదు.

ఉగ్గినపాలెంలో ఎత్తిపోతల పథకం

ఉగ్గినపాలెం గ్రోయిన్.. దాదాపు 500 ఎకరాలకుపైనే ఆయకట్టుకు ప్రధాన సాగునీటి వనరు. అయితే ఏటా గండ్లు పడి, మరమ్మతులకు గురై ఆశించిన మేర సాగునీరందని స్థితి. దీంతో ఆయకట్టు రైతుల ఆశలన్నీ వరుణుడిపైనే..! వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల ఆశలు తీరనున్నాయి. గ్రోయిన్ మరమ్మతుల స్థానంలో రూ.2 కోట్లతో ఎత్తిపోతల పథకానికి సన్నాహాలు చేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- మరమ్మతుల స్థానంలో కొత్త ప్రతిపాదనలు
- రూ.2 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు
- మంత్రి అమర్‌నాథ్ చొరవతో చురుగ్గా చర్యలు


ఉగ్గినపాలెం గ్రోయిన్


గండిపడి మరమ్మతులకు నోచుకోని గ్రోయిన్

కశింకోట : మండలంలోని శారదానదిపై తేగాడ గ్రామం వద్ద ఉన్న ఉగ్గినపాలెం గ్రోయిన్ స్థానంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నది ప్రవాహ ఉధృతికి తరచుగా దెబ్బతింటున్న గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టడానికి బదులు రైతుల కోరిక మేరకు ఈ పథకాన్ని నిర్మిస్తే, ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందడంతోపాటు అదనపు ఆయకట్టుకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

బ్రిటీష్ కాలంలో నిర్మాణం

ఉగ్గినపాలెం గ్రోయిన్ కింద 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట తదితర గ్రామాలకు చెందిన భూములకు సాగునీరు అందించేందుకు బ్రిటీష్ హయాంలో దీన్ని నిర్మించారు. నది ప్రవాహ ఉధృతి కారణంగా తరచూ గ్రోయిన్‌కు గండ్లు పడుతున్నాయి. ఆయకట్టుకు ఏనాడూ పూర్తిస్థాయిలో సాగునీరు అందిన పరిస్థితి లేదని రైతులు చెప్తున్నారు. దీంతో వరుణుడిపైనే భారం వేసి సాగు చేస్తున్న రైతులు ఏటా ఎంతో కొంత మేర నష్టపోతున్నారు. గ్రోయిన్ తరచుగా దెబ్బతింటుండటం, తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది.

15 ఏళ్లలో అరకొర మరమ్మతులు

ఈ నేపథ్యంలో 2003లో అప్పటి మంత్రి దాడి వీరభద్రరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శాశ్వత ప్రాతిపదికన రూ.30 లక్షలతో గ్రోయిన్‌కు మరమ్మతులు చేయించారు. నది ప్రవాహ ఉధృతికి ఆ భాగం మినహా, మిగిలిన గ్రోయిన్‌లో రెండు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో చాలా కాలం మరమ్మతులు చేపట్టకుండా అలానే వదిలేశారు. ఈ గ్రోయిన్ నిర్మాణంలో లోపం వల్లే తరచూ గండ్లు పడుతున్నాయని భావించిన ఇంజనీరింగ్ అధికారులు ఓ దశలో దీని డిజైన్ మార్చి పునర్నిర్మించాలనుకున్నారు. అందుకు సరిపడా నిధులు లేకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వం 2018 జనవరిలో నీరు-చెట్టు కింద రూ.90 లక్షలతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదించారు. దీనిలో భాగంగా రూ.35 లక్షలు వెచ్చించి ఒక గండిని పూడ్చారు. బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్థాంతరంగా ఆపేశారు. మరో గండి పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో అప్పటి నుంచి నీరు వృథాగా పోతోంది.

జగన్ ప్రభుత్వంలో శాశ్వత చర్యలు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు 2021లో నీటిపారుదల శాఖ అధికారులు రూ.89 లక్షలతో అంచనాలు వేశారు. అయితే తరచుగా దెబ్బతింటున్న గ్రోయిన్‌ను మరమ్మతులు చేపట్టేకంటే అనువైన చోట ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి, సాగునీటి కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు ఈ ప్రాంత రైతులు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు తమ అభ్యర్థన విన్నవించుకున్నారు. పైగా అదనపు ఆయకట్టుకు కూడా సాగునీరు అందగలదని పేర్కొన్నారు. దీంతో మంత్రి స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) అధికారులతో చర్చించి పథకం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అంచనాలు తయారు చేసి, ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు సుమారు రూ.2 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. ఇక పథకానికి నిధులు మంజూరై పనులు పూర్తి అయితే ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందగలదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు విరమణ

2021లో రూ.89 లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదించాం. ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రతిపాదించారు. దీంతో ఉగ్గినపాలెం గ్రోయిన్ మరమ్మతుల యోచన విరమించాం. ఏపీఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి అంచనాల తయారు చేస్తున్నారు. వారికి కావలసిన సమాచారాన్ని సమకూరుస్తున్నాం.

– హనుమంతరావు, ఏఈ, ఇరిగేషన్ సబ్ డివిజన్, అనకాపల్లి

గురుకులాలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశాలకు పరీక్షలు రాశారు. వీరిలో జ్ఞానతేజశ్రీ, డి.ప్రియవర్షిణి, కె.మహితేజ, పి.వరుణ్, శీరం సుమిత్ర పరవాడ మండలం తానాం, భీమిలి, అచ్యుతాపురం, యలమంచిలి, అనకాపల్లిలో గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయుడు కె.ఎస్.ఆర్.మూర్తి ఆదివారం తెలిపారు. ఒక్క పాఠశాల నుంచే ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను సర్పంచ్ రుత్తల జ్యోతి అభినందించారు.

ఘనంగా అమ్మవారి ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: గ్రామాల్లో అమ్మవార్ల ఒడ్డు పండగలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాగరంలో మోదమాంబ అమ్మవారికి గుమ్మాల కొండలరావు కుటుంబ సభ్యులు ఒడ్డు పండగ నిర్వహించారు. వెస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం పాల్గొన్నారు.